సాక్షి
నిర్మల్
సోమవారం, 12, ఫిబ్రవరి, 2024



కల్యాణ వైభోగమే..
నేటి నుంచి శుభ ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి. దీంతో వివాహాది శుభకార్యాలు చేసుకునేవారు ముందు జాగ్రత్తగా ఇప్పటికే ఫంక్షన్‌హాళ్లు బుక్ చేసుకున్నారు. 8లో▸



అమ్మవారికి బోనం
జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. నైవేద్యం సమర్పించి పిల్లాపాపలను చల్లగా చూడాలని భక్తులు అమ్మవార్లను వేడుకున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /20.0
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

మేడారానికి ప్రత్యేక బస్సులు
భైంసాటౌన్: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో భైంసా డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్‌ఎం సోలొమన్ రాజు సూచించారు. ఆదివారం భైంసా డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో రద్దీ అధికంగా ఉంటుందని, అందుకనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన


కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో పరశురాం

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన వాసవీ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ఆదివారం డీఐఈవో పరశురాం పరిశీలించారు. డీఈసీ మెంబర్లు రవికిరణ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

భైంసాలో కరాటే పరీక్షలు


తలపడుతున్న విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో ఆదివారం విద్యార్థులకు జేకేఏఐ బెల్ట్ జిల్లా స్థాయి కరాటే గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. జేకేఏఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్ భాటియా, జిల్లా కరాటే ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షల్లో భైంసా, లోకేశ్వరం, బాసర, అష్ట, కుభీర్ ప్రాంతాల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో పలువురు రెడ్, యెల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్‌బెల్ట్‌లు గెలుచుకున్నారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ సాయికృష్ణ, శివరాజ్‌గౌడ్, లింగం, జ్ఞానతేజ, రాజశ్రీ, సాయినాథ్, నితిన్‌గౌడ్ ఉన్నారు.

భారత్‌బంద్ సక్సెస్ చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసాటౌన్: సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జే రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఆదివారం భారత్‌బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల హక్కుల కోసం, కనీస మద్దతు ధరల చట్టం, రుణమాఫీ, విద్యుత్ సవరణ చట్ట ఉపసంహరణ, రైతులపై కేసుల ఉపసంహరణ, అమరులైన రైతులకు నష్టపరిహారం చెల్లింపు తదితర డిమాండ్ల సాధనకు బంద్ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ నాయకులు ముత్తన్న, కృష్ణదాస్, ఏఐకేఎంఎస్ నాయకులు గంగాధర్, విఠల్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


వికాస్



సరయూ

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ముధోల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు వికాస్, సరయూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 16వ తేదీ నుంచి సూర్యాపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొననున్నారు.

నిల్వలపై నిఘా



జిల్లా కేంద్రంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో నాగరాజు (ఫైల్)

- 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం' అమలులోకి తెచ్చిన వ్యవసాయశాఖ
- వారంలో రెండు రోజులు షాపుల తనిఖీ
- ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు
- నిల్వల్లో తేడా వస్తే షాపు లైసెన్స్ రద్దు

నిర్మల్‌చైన్‌గేట్: ఎరువుల తనిఖీ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నిల్వల్లో తేడా రాకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం 'ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం' పేరిట ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. అధికారులు తనిఖీల్లో గుర్తించిన అంశాలను ఇందులోనే నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ పంటల సాగు వివరాల నమోదుకు క్రాప్ బుకింగ్ ఆన్‌లైన్ విధానం అమలు చేస్తోంది. ఇదే తరహాలో ఎరువుల నిల్వలను తెలుసుకునేందుకు యాప్ సిద్ధమైంది. వివిధ రకాల ఎరువులను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పాయింట్ ఆఫ్ సేల్(పీవోఎస్) విధానంలో రైతులకు విక్రయిస్తున్నారు. ఈ విధానంలో రైతులు తమ ఆధార్ కార్డు, పాస్ బుక్ సమర్పించాల్సి ఉంటుంది. అయితే రైతులు ఆధార్ కార్డ్, పాస్ బుక్ తీసుకురాకపోవడంతో దుకాణాల యజమానులు పీవోఎస్ మిషన్‌లో సమగ్రంగా వివరాలు నమోదు చేయడం లేదు. దీంతో నిల్వల వివరాలు తెలుసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతుండడంతో వ్యవసాయ శాఖ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ ఎరువుల డీలర్లతో పాటు, టీఎస్ ఆగ్రోస్, మార్క్‌ఫెడ్ వంటి ఎరువులు సరఫరా చేసే సంస్థల్లో కూడా ఈ నూతన విధానాన్ని అమలు చేయాల్సి ఉంటుంది.

వారంలో రెండు రోజులు

జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వలను అధికారులు పరిశీలించి వాటిని యాప్‌లో నమోదు చేస్తారు. ఎరువుల బస్తాల వద్ద ఫొటోలు దిగి, స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి, ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గతంలోనే షాపులను జీపీఎస్ ద్వారా ట్యాగ్ చేశారు. దీంతో షాపు వద్ద ఉండి గూగుల్ ద్వారా ఫొటో దిగి లొకేషన్‌ను కరెక్ట్‌గా పంపించాలి. దీనికోసం వారంలో సోమ, గురువారాల్లో ఏవో, ఏడీఏ, జేడీఏ స్థాయి అధికారులు నెలలో ఐదుసార్లు దుకాణాలు తనిఖీ చేయాలి. జిల్లాలోని అధికారులకు వారి పరిధిలోని ఐదు షాపులను కేటాయించనున్నారు. దుకాణాదారులు పీవోఎస్ యంత్రాలను ఉపయోగిస్తున్నారా.. లేదా? వివరాలు ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిర్వహణ ఉందో.. లేదో తెలియజేయాలి. దీంతో ఎరువుల విక్రయాల తీరును జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. కలెక్టర్, జేడీఏ మాత్రమే యాప్‌లోకి లాగిన్ అయ్యే అవకాశం ఉంటుంది. దీంతో కిందిస్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతీ దుకాణాన్ని తనిఖీ చేసి పూర్తి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాల్సిన అవసరం ఉంది.

పక్కదారి పట్టకుండా..
వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులను అందిస్తోంది. చాలా ప్రాంతాల్లో డీలర్లు ఎరువులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడుతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్‌లో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఫలితంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎరువుల సరఫరాలో పారదర్శకతను మరింత పెంచేందుకు వ్యవసాయశాఖ కొత్త యాప్‌నకు రూపకల్పన చేసింది.

మరింత పారదర్శకత


కొత్త విధానంతో ఎరువుల విక్రయాల్లో మరింత పారదర్శకత పెరుగుతుంది. నిల్వలపై ప్రభుత్వం వద్ద సమాచారం ఉంటుంది. రైతులకు ఎరువుల కొరత అనే సమస్య ఉండదు.

– నాగరాజు, ఏవో, నిర్మల్

అక్రమాలు అరికట్టేలా...


జిల్లాలోని ఎరువుల షాపుల్లో స్టాక్ నిల్వలపై తనిఖీలు కొనసాగుతున్నాయి. ఏవో, ఏడీఏతో పాటు జేడీఏ కూడా ఎరువుల షాపులను తనిఖీ చేసే ఫొటోలను యాప్‌లో పొందుపరుస్తున్నాం. వారానికి ఐదు షాపులను తనిఖీ చేసి వాటి వివరాలు నమోదు చేస్తున్నాం. ఎరువుల వివరాలు పారదర్శకంగా ఉండేలా అక్రమాలను అరికట్టేలా ప్రభుత్వం ఈ ఆలోచన చేసింది.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఇచ్చినప్పుడే తెచ్చుకోవాలి!

- చౌక బియ్యం పంపిణీలో ఇష్టారాజ్యం!
- సకాలంలో దుకాణాలు తెరవని డీలర్లు
- రేషన్ కోసం పని మానేయాల్సిన దుస్థితి
- డీలర్ల తీరుతో నష్టపోతున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: పేదలకు చౌకధరల దుకాణాల ద్వారా అందిస్తున్న బియ్యం పంపిణీ ఇష్టారాజ్యంగా మారింది. పలువురు రేషన్ డీలర్లు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన దుకాణాలు తెరవడంతో చాలామంది లబ్ధిదారులు బియ్యం పొందలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కొంతమంది డీలర్లు బియ్యం పంపిణీ చేయాల్సిన రోజుల్లో సమయపాలన పాటించడం లేదు. బియ్యం కోటా అయిపోయిందనో, ఇతర కారణాలతోనో షాపులు మూసి ఉంచుతున్నారు. దీంతో ఆయా దుకాణాల్లో లబ్ధిదారులు బియ్యం తీసుకోలేకపోతున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు వలస వచ్చినవారు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు స్థానిక రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకుందామనుకుంటే ఎప్పుడు తెరిచి ఉంటాయో, ఎప్పుడు మూసి ఉంటాయో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పనులు మానుకుని బియ్యం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి కూడా రేషన్ డీలర్లు ఒకేసారి బియ్యం కోటా తీసుకోకుండా, పలు దఫాలుగా తీసుకుంటుండడం, వచ్చిన బియ్యం కొద్దిరోజులకే అయిపోతుండడంతో సమస్య తలెత్తుతోంది. పూర్తి కోటా బియ్యం ఒకేసారి దుకాణాల్లో దించుకుంటే పంపిణీ పూర్తయ్యేవరకు దుకాణాలు మూసి ఉంచే పరిస్థితి ఉండదని లబ్ధిదారులు అంటున్నారు.



ప్రతినెలా 40 వేల క్వింటాళ్లకుపైనే...

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాలకు నెలవారీగా బియ్యం కోటా కేటాయిస్తోంది. జిల్లాలో 396 రేషన్ దుకాణాల పరిధిలో 2.08 లక్షల రేషన్‌కార్డులు ఉండగా, 6.41 లక్షల లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు 40,574.78 క్వింటాళ్ల బియ్యం అవసరమవుతుంది. దీంతో పౌరసరఫరాల శాఖ ప్రతినెలా కోటా పంపిణీకి ముందే ఎంఎల్ఎస్ పాయింట్లకు అక్కడి నుంచి డీలర్లకు బియ్యం చేరవేస్తుంది. అయితే, కొందరు డీలర్లు ఒకేసారి బియ్యం కోటా దించుకోకుండా పలు దఫాలుగా దించుకుంటున్నారు. రవాణా సౌకర్యం లేని, ఇరుకుగా ఉన్న దుకాణాలకు ఇలా పంపిణీ చేస్తున్నారు. దీంతో వచ్చిన కొద్దిపాటి బియ్యం కొద్దిరోజులకే అయిపోతున్నాయి. మళ్లీ బియ్యం వచ్చే వరకు దుకాణాలు మూసి ఉంచడంతో లబ్ధిదారులు బియ్యం పొందలేకపోతున్నారు. ఇలా నెలకు సుమారు 4 వేల క్వింటాళ్ల బియ్యం పంపిణీకి నోచుకోవడం లేదు. దీంతో ఆయా రేషన్‌దుకాణాల్లోనే ఓపెనింగ్ నిల్వగా చూపిస్తున్నారు. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం కొందరు రేషన్ డీలర్లు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంపిణీకి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రేషన్ డీలర్లు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జిల్లాలో ఈనెల రేషన్ బియ్యం కోటా వివరాలిలా...

రేషన్ కార్డులు	2,08,487
లబ్ధిదారులు	6,41,987
అవసరమైన బియ్యం కోటా	40,593.54 క్వింటాళ్లు
దుకాణాల్లో ఓపెనింగ్ నిల్వలు	4,604.24 క్వింటాళ్లు
కేటాయించిన బియ్యం కోటా	35,989.30 క్వింటాళ్లు

గతనెల బియ్యం తీసుకోలేదు..
గతనెలలో పలుసార్లు రేషన్ దుకాణానికి వెళ్లిన. డీలర్ బియ్యం కోటా అయిపోయిందని, వచ్చిన తరువాతే రావాలని తిప్పి పంపించాడు. తీరా కొద్దిరోజులకు వెళ్తే కోటా పంపిణీ పూర్తయిపోయిందని చెప్పిండు. తరువాతి నెలలో తీసుకోవాలన్నాడు. దీంతో గతనెల బియ్యం పొందలేకపోయాను. డీలర్లు సకాలంలో దుకాణాలు తెరిచి బియ్యం పంపిణీ చేయాలి.

– ప్రశాంత్, భైంసా

మహిళాశక్తి జాగృతం కావాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు, వక్తలు

- వేదకాలం నుంచే స్త్రీవిద్య ఉంది
- 'నారీ శక్తి సమ్మేళనం'లో వక్తలు
- భారీగా తరలివచ్చిన మహిళలు

నిర్మల్: ప్రస్తుత సమాజంలో మహిళాశక్తి జాగృతం కావాలని, వేదకాలం నుంచే స్త్రీ విద్య ఉందని, చదువుతో పాటు సంస్కారాన్నీ పిల్లలకు అలవర్చాలని పలువురు మహిళామూర్తులు పేర్కొన్నారు. మహిళా సమన్వయ వేదిక ఆధ్వర్యంలో నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన నారీశక్తి సమ్మేళనానికి భారీసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఆదిలాబాద్, ఉట్నూరు, ఇచ్చోడ, బోథ్, భైంసా, నిర్మల్, ఖానాపూర్ తదితర ప్రాంతాల నుంచి వెయ్యికి పైగా మహిళలు సమ్మేళనంలో పాల్గొన్నారు. ముఖ్యవక్తలుగా నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి, వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షురాలు సునీతారామ్మోహన్, ప్రజ్ఞాభారతి బాధ్యులు వేదసంహిత, స్వదేశీజాగరణ మంచ్ మహిళాప్రముఖ్ డాక్టర్ స్వప్న, ముఖ్య అతిథులుగా డీఆర్డీవో విజయలక్ష్మి, సీటీవో గోదావరి, ఎంసీ హెచ్ సివిల్‌సర్జన్ రజిని, మీనాధనానివాలా హాజరయ్యారు. ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండు సమావేశాలు, చర్చాగోష్ఠి నిర్వహించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నారీ చేతిలోనే నవసమాజం

వంటింటి నుంచి ప్రతీ రంగం వరకూ మహిళ విజయవంతంగా దూసుకుపోతోందని, ప్రస్తుత సమాజం మహిళల చేతుల్లోనే ఉందని వక్తలు పేర్కొన్నారు. చదువుతోనే మహిళలు అన్నిరంగాల్లో రాణించగలరని, వేదకాలం నుంచే స్త్రీవిద్య ఉన్న విషయాన్ని గుర్తించాలని పలు ఉదాహరణలతో పేర్కొన్నారు. తాము ధర్మాన్ని ఆచరిస్తూ తమ పిల్లలూ ఆచరించేలా చూడాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. సమాజంలో పొంచి ఉన్న సమస్యలు, సవాళ్లను ఎదుర్కొనేలా ఉండాలని, ధర్మపరిరక్షణ, సాటి మహిళల రక్షణ కోసం సంఘటితంగా ముందుకు రావాలని సూచించారు. ధర్మరక్షణలో భాగంగా సత్యభామ, కైకేయిలు యుద్ధం కూడా చేశారని గుర్తుచేశారు.

ఫోన్లు పక్కన పెడితేనే..
ఇంట్లోకి రాగానే ఫోన్లు పక్కన పెడితేనే కుటుంబంలో ప్రేమలు పెరుగుతాయని, మన తల్లిదండ్రులను ప్రేమించినట్లే అత్తామామలను చూసుకుంటే వృద్ధాశ్రమాలు ఉండవంటూ చర్చాగోష్ఠిలో పలువురు మహిళలు చెప్పిన విషయాలు ఆకట్టుకున్నాయి. పిల్లలకు ధర్మాన్ని చెప్పడం కాదు, ఆచరించేలా చూడాలన్నారు. రామాయణ, మహాభారతాల్లోని విలువలను నేర్పాలని సూచించారు. సమాజంలో లైంగికదాడులు, హింసలకు గురవుతున్న సాటి మహిళలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. లవ్‌జిహాద్, ప్రేమపేరిట చేస్తున్న మోసాలపైనా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళాశక్తి, అయోధ్యరాముడు, శ్రీకృష్ణుడికి సంబంధించిన పాటలపై చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని డీఆర్డీవో విజయలక్ష్మి, సివిల్‌సర్జన్ రజిని, సీటీవో గోదావరి తదితరులు పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణను అనురాధ పంపట్‌వార్, అయ్యన్నగారి రచన, శ్రీవాణి తదితరులు సమన్వయం చేశారు. సమ్మేళనం విజయవంతం కావడానికి భైంసా, నిర్మల్, ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ ప్రాంతాలకు చెందిన మహిళాబాధ్యులు విశేషంగా కృషిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యారంగానికి తక్కువ నిధులు

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి తీవ్ర నిర్లక్ష్యం చేసిందని పీడీఎస్‌యూ నాయకులు ఆరోపించారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తామని మోసం చేసిందని ఆరోపించారు. మూడేళ్లుగా పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ నిధులు బకాయిలున్నాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. నాయకులు రాజారాం, గంగరాజు, మనోజ్, బాబన్న, రుద్ర ప్రతాప్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు

నిర్మల్ ఖిల్లా: వారంతా మూడుదశాబ్దాల కిందట కలిసి చదువుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఉపాధి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అంతా ఒక్క చోట కలుసుకోవాలని అనుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1993–96 విద్యా సంవత్సరంలో బీఎస్సీ బీజెడ్‌సీ చదివిన వీరికి జిల్లా కేంద్రంలోని స్థానిక మయూరి ఇన్ హాల్ వేదికైంది. ఆదివారం దాదాపు 30మంది పూర్వ విద్యార్థులంతా ఇక్కడ కలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పల గణేశ్ చక్రవర్తి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాస్, శ్రావణ్ తదితరులున్నారు.

'హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం'

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికుల హక్కుల రక్షణకు సంఘటితంగా పోరాడుదామని ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం ఐఎఫ్టీయూ జిల్లా కమిటీ సమావేశం కార్యదర్శి ఆర్.రామలక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లయినా రైతాంగం, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగిస్తూ దేశప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. నాలుగు బొగ్గు గనులను వేలం వేయడానికి సిద్ధమైందని తెలిపారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తెచ్చి కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికిందని పేర్కొన్నారు. ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను రైతులు, కార్మికులు, బడుగు బలహీన ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, కోశాధికారి ఎండీ గఫూర్, జిల్లా కమిటీ నాయకులు కే లక్ష్మి, గంగామణి, ఎస్.లక్ష్మి, ముత్తవ్వ, పోశెట్టి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జిల్లా ఆస్పత్రిగా మార్పునకు కృషి

భైంసా: భైంసా ఏరియాస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ హామీ ఇచ్చారు. ఆదివారం ఏరియాస్పత్రిలో నిర్వహించిన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భైంసా ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చాలని ఇటీవలే ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. భైంసా ఏరియాస్పత్రిలో మూడు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేయడంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. భైంసా ఏరియా ఆస్పత్రిలో ఎనిమిది అవుట్ పేషెంట్ గదులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.43 లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకుంటే తన ఫండ్, దాతల సహకారంతో ఆస్పత్రిని అభివృద్ధి పరుస్తామని చెప్పారు. వైద్యులు శృతి, రజినీకాంత్, దయానంద్‌రెడ్డి, నరేశ్, శ్రీకాంత్‌ను సన్మానించారు. పేద ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ సాగరాబాయిరాజన్న, ఎంపీపీ అబ్దుల్ రజాక్, జెడ్పీటీసీ సభ్యుడు దీపసోలంకిభీంరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

మూడింటికే పెంబి ఆస్పత్రికి తాళం

పెంబి: పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి మధ్యాహ్నం మూడింటికే తాళం పడింది. ఫిట్స్ వచ్చిన ఆరేళ్ల గిరిజన చిన్నారికి వైద్యం అందలేదు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేణునగర్ పంచాయతీ పరిధి లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆరేళ్ల గిరిజన చిన్నారికి ఆదివారం ఫిట్స్ వచ్చాయి. వెంటనే పాపను ద్విచక్రవాహనంపై మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి మధ్యాహ్నం 3గంటల సమయంలో తీసుకువచ్చారు. అప్పటికే ఆస్పత్రి గేటుకు తాళం వేసి ఉంది. వైద్యులు, సిబ్బంది ఒక్కరు కూడా లేరు. స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ అరకొర సిబ్బంది ఉన్నా అందుబాటులో ఒక్కరూ లేరు. ఈ విషయమై ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ శివను సంప్రదించగా.. సిబ్బంది అక్కడే ఉన్నారని తెలిపారు. కోతుల బెడదతో గేటు మూసి వేసినట్లు సమాధానమిచ్చారు.



తాళం వేసి ఉన్న పెంబి ప్రభుత్వ ఆస్పత్రి

క్లుప్తంగా

చెకుముకి సైన్స్‌టాలెంట్ టెస్టులో ప్రతిభ



విద్యార్థినులకు ప్రశంసపత్రాలు అందిస్తున్న డైరెక్టర్ నర్సింగరావు

తాంసి: జనగామ జిల్లాలో ఈనెల 9,10,11 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో జిల్లా తరఫున తాంసి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పల్లవి, బిందుజ, శివప్రియ సత్తాచాటి రాష్ట్రస్థాయిలో ఏడో స్థానంలో నిలిచారు. వీరితోపాటు గైడ్ టీచర్ ఉమామహేశ్వర్‌కు ఐఏఆర్‌సీఐ డైరెక్టర్ నర్సింగరావు ప్రశంసపత్రాలు అందజేశారు. ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు.

రాష్ట్రస్థాయిలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో రాష్ట్రస్థాయిలో 3వ స్థానంలో నిలిచారు. జనగామ జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు హర్షిత, హర్షవర్ధన్, శివకుమార్ రాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవార్డులు అందజేశారు. చెకుముకి టెస్ట్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవీందర్‌రెడ్డి, గైడ్ టీచర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం

తానూరు: మండలంలోని కోలూరు, మొగ్లి, మసల్గాతండా, కోలూరుతండా గ్రామాల్లో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. రాళ్లతో కూడిన భారీ వర్షం కురవడంతో కోత చేసిన సోయా, పెద్దజొన్న పంటలు దెబ్బతిన్నట్లు దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు.

2 తలలు, 8 కాళ్లతో లేగదూడ జననం

బోథ్: మండలంలోని కోట కె గ్రామంలో రెండు తలలు ఎనిమిది కాళ్లతో లేగదూడ జన్మించింది. ఆ వెంటనే మృతి చెందింది. గ్రామంలో రైతు మాధవ్‌కు చెందిన ఆవు గర్భంతో ఉండగా, పశు వైద్యాధికారి శ్రావణ్, అవినాష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆపరేషన్ చేయగా లేగదూడ జన్మించి మృతి చెందింది. ఆవును కాపాడారు.

అన్నదమ్ముళ్ల గొడవలో తల్లికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని రణదీవెనగర్‌లో ఆదివారం అన్నదమ్ముళ్ల గొడవలో తల్లికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన జాదవ్ జితేందర్, ఆయన చిన్న తమ్ముడు జాదవ్ దినేశ్ మధ్య గొడవ జరిగింది. మాటమాట పెరిగి దాడికి దిగారు. ఈ సమయంలో తల్లి జాదవ్ రేణుకా అడ్డురాగా ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కోనేరు బావి నుంచి పవిత్ర జలం తీసుకువస్తున్న కొత్త కోడళ్లు, అల్లుళ్లు



భాన్‌దేవత ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు



రంగుల రాట్నాల వద్ద యువతీయువకుల సందడి



ఘనంగా పెర్సపేన్ పూజలు



పెర్సపేన్ పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌లో మహాపూజతో నాగోబా జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు పెర్సపేన్, భాన్ దేవతల పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో భాన్ దేవత ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. బేటింగ్ అయిన కొత్త కోడళ్లు కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలం తీసుకురాగా.. మెస్రం వంశం అల్లుళ్లు ఆలయం ఎదుట పాత పుట్టలను తొలగించారు. ఆడపడుచులు, మహిళలు పవిత్ర జలంతో కొత్త పుట్టలను తయారు చేయడంతోపాటు భాన్ దేవతలను శుద్ధి చేశారు. తర్వాత మెస్రం వంశీయులు నాలుగు సగల పెర్సపేన్(పెద్ద దేవుల)ను కొలిచారు. గోదావరి నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో శుద్ధిచేసి మొక్కుకున్నారు. ఇందులో మెస్రం వంశం పురుషులు పాల్గొన్నారు. నెల 13న గోవడ్ ముఖద్వార వద్ద బేతల్ పూజలు చేసి మెస్రం వంశీయుల ముగించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

నాగోబా చరిత్ర, 22 కితల బోధన

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులకు సంప్రదాయ వంటకాలతో సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ప్రధాన్ కితకు చెందిన మెస్రం గంగారం ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ కొత్త కోడళ్ల, మెస్రం వంశం మహిళలకు నాగోబా చరిత్ర, 22 కితలను బోధించారు. మెస్రం వంశీయులకు కానుకలు అందజేశారు. మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి, మెస్రం రామ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జాతర



క్యూలో భక్తులు

నాగోబా జాతర కొనసాగుతోంది. ఆదివారం ఉమ్మడి జిల్లా నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. నాగోబా ఆలయంలో పూజలు చేశారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గే గణేశ్ నాగోబా ఆలయంలో పూజలు చేశారు. మెస్రం వంశీయులు ఆయన్ను సన్మానించి నాగోబా ప్రతిమ అందించారు. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద చిన్నారులతో సందడిగా మారింది.



నాగోబాకు మొక్కుతున్న యువతులు



భాన్, పెర్సపేన్ పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



కోనేరు బావి నుంచి పవిత్ర జలం సేకరిస్తున్న బేటి కోడళ్లు



పుట్ట వద్ద పూజలు చేస్తూ..



పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

నిందితులకు శిక్షపడేలా చూస్తాం



ఎమ్మెల్యేకు దండం పెడుతున్న అలేఖ్య తల్లి

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన అలేఖ్యను హత్య చేసిన నిందితులకు కఠిన శిక్షపడేలా చూస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఆదివారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. సంఘటన జరిగిన రోజు నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతోపాటు తాను జిల్లా ఎస్పీతో మాట్లాడి కేసు పురోగతిపై అడిగి తెలుసుకున్నామని అన్నారు. ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేయించి నిందితులకు కఠిన శిక్షపడేలా చూస్తామన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయశీల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతోపాటు గాయపడ్డ మూడేళ్ల బాలుడు రియాన్స్‌ను పరామర్శించారు.

రక్షణ కల్పించాలని వినతి

నిందితుడు శ్రీకాంత్ కుటుంబీకుల నుంచి తమకు ప్రాణహాని ఉందని ప్రభుత్వం నుంచి రక్షణ కల్పించాలని అలేఖ్య తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కేసులో మిగతా నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు చిన్నం సత్యం, దయానంద్, షబ్బీర్‌పాషా, మ్యాదరి రాజేశ్వర్, జన్నారపు శంకర్, కట్ట శ్రీనివాస్, బాలసంకుల రాజేందర్ ఉన్నారు.

అలేఖ్య హత్య కేసులో మరో ఇద్దరి రిమాండ్

ఖానాపూర్: అలేఖ్య హత్య కేసులో మరో ఇద్దరిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మోహన్ తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడారు. కేసులో ఏ2గా ఉన్న నిందితుడి తల్లి జూకింది సత్తవ్వతోపాటు నిందితుడి సోదరుడు జూకింది శివకృష్ణను బాదనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

నిప్పంటించుకొని వృద్ధురాలి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గానగర్‌కు చెందిన రుక్మాబాయి (70) అనే వృద్ధురాలు నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రుక్మాబాయి గత కొన్నేళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయింది. ఇదే క్రమంలో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంటున్న సమయంలో ఒంటికి నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసేసరికి ఆమె శరీర సగభాగం కాలిపోయింది. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి మనుమడు మెస్రం దిగంబర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అనుమానాస్పదంగా రైతు మృతి



రైతు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తలమడుగు: మండలంలోని దేవాపూర్‌లో రైతు అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాయిని లింగన్న (55) శనివారం పొలానికి వెళ్లగా రాత్రివరకు ఇంటికి రాలేదు. కుటుంబీకులు గ్రామస్తులతో కలిసి పొలానికి వెళ్లారు. బావి వద్ద లింగన్న చెప్పులు కనిపించడంతో బావిలో వెతకగా మృతదేహం లభించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. లింగన్నను పాత కక్షలతో చంపి బావిలో పడేశారని కుటుంబీకులు ఆరోపించారు. కాగా, సంఘటన స్థలాన్ని ఆదిలాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ సైదారావు, ఎస్సై ధనశ్రీ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

చెరువులో పడి మత్స్యకారుడి మృతి

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో గల కోమటిచెరువులో ఆదివారం చేపలు పడుతుండగా మత్స్యకారుడు మరియప్ప (40) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామదేవతల బోనాల పండుగ సందర్భంగా గ్రామ మత్స్యకారులు చేపలు పట్టేందుకుగాను సోన్ మండలం గాంధీనగర్‌కు చెందిన ఐదుగురు మత్స్యకారులను పిలిపించారు. అందరూ చెరువులో చేపలు పడుతుండగా మరియప్ప కాలికి వల చుట్టుకుని ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి నీటిలో జారిపడ్డాడు. ఆ తర్వాత ఎంతకు పైకి రాకపోవడంతో తోటి మత్స్యకారులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చివరకు గాంధీనగర్‌లోని బంధువులకు అందించిన సమాచారంతో వారు జామ్‌కు చేరుకున్నారు. గాలాల సాయంతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. రెండు కాళ్లకు వల బలంగా చుట్టుకోవడంతో మృతిచెంది ఉండవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య నర్సుబాయి, 13 ఏళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.

కల్యాణ వైభోగమే..

- నేటి నుంచి శుభఘడియలు

కుంటాల: పెళ్లి సందడి మొదలైంది. నేటి నుంచి ఏప్రిల్ 26 వరకు పెళ్లిబాజాలు మోగనున్నాయి. మాఘమాసం నుంచి ఫాల్గుణం, చైత్రమాసం వరకు శుభముహూర్తాలు ఉన్నాయి. వివాహాలు, గృహప్రవేశాలు, విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలకు సుముహూర్తాలు ఖరారు కావడంతో పెళ్లిళ్ల తేదీలు నిర్ణయించుకుని ఫంక్షన్ హాళ్లు బుక్ చేసుకుంటున్నారు.

ముహూర్తాలు తేదీలు..

మాఘమాసం:
ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 28, 29
మార్చి 2, 3 తేదీలు

ఫాల్గుణం:
మార్చి 15, 17, 22, 24, 25, 27, 28, 30

చైత్రమాసం: ఏప్రిల్ 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26

అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి



మాఘమాసం, ఫాల్గుణం, చైత్రమాసాల్లో శుభఘడియలు ఉన్నాయి. ఈ సమయాల్లో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, శుభకార్యాలు చేపడితే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. దీంతో ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉంటారు.

– ప్రకాశ్‌జోషి, వేద పండితుడు (కల్లూర్ సాయిబాబా ఆలయం)

మెట్ట పంటలసాగులో నైపుణ్యం సాధించాలి



సాగు పరికరాలు అందిస్తున్న వీకే సింగ్

గుడిహత్నూర్: రబీలో మెట్ట పంటల సాగులో నైపుణ్యం సాధించాలని ఐకార్–క్రీడా డైరెక్టర్ వీకే సింగ్ అన్నారు. మండలంలోని వైజాపూర్‌లో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. వైజాపూర్ గ్రామాన్ని ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద తీసుకుని గత మూడేళ్లుగా ఇక్కడ రైతులతో తమ సిబ్బంది పని చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. రైతులను గ్రూపులుగా చేసి వారికి రాయితీతో అందిస్తున్న వ్యవసాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతు సంఘాలకు రెయిన్ గన్, వర్మీ కంపోస్ట్ టార్పాలిన్, చేపల దాణా, కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఐకార్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోరంజన్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ ఎస్.మూర్తి శోక్ కుమార్ ఇందోరియా, డాక్టర్ సుమంత కుందు, డాక్టర్ కేబీ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

- మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడికి
- సరస్వతి శిశుమందిర్‌లో అపూర్వ సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: వారంతా బాల్యమిత్రులు..ఒకే చోట చదువుకున్నారు.. పదో తరగతి పూర్తయ్యాక ఎవరిదారిలో వారు వెళ్లారు. కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొందరు వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 30 ఏళ్ల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడిలో కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం 1993–94 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం చేసుకున్నారు. తరగతి గదుల్లో కూర్చొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థులను ఒకేచోటికి చేర్చిన మిత్రులు అశోక్, ప్రమోద్, శివకుమార్, మహేందర్, నర్మద, లక్ష్మి, వైశాలి, అరుణ కృషిచేశారు.

మరిచిపోని అనుభూతి..



సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో పదేళ్ల పాటు పనిచేశాను. మాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమలాపురం. ఇక్కడ పనిచేసిన తర్వాత నాకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. 610 జీవోలో నేను ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాను. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందాను. చదువులు చెప్పిన తనను గుర్తుంచుకొని ఈ సమ్మేళనానికి పిలిపించి సన్మానించడం ఆనందంగా ఉంది.

– మురళీకృష్ణ, ఆచార్యులు

ఆనందంగా ఉంది



చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సంతోషానికి హద్దులు లేకుండా పోయింది. ప్రస్తుతం ముంబయిలో టీచర్ ఉద్యోగం చేస్తున్నాను. చిన్ననాటి స్నేహితులు పూర్వ సమ్మేళనం ఉందని తెలుపడంతో కలుసుకోవాలని వచ్చాను.

– మాయ, ముంబాయ్

జ్ఞాపకాలను నెమరువేసుకున్నాం



పాఠశాలలో 10వ తరగతి వరకు చదివాం. ఇక్కడ నేర్చుకున్న సంస్కృతి, సంప్రదాయాలు ఎప్పటికి మరిచిపోలేం. ప్రస్తుతం టీచర్ ఉద్యోగ్యరీత్యా నిర్మల్‌లో ఉంటున్నాను. చిన్ననాటి స్నేహితులతో కలుసుకోవడం సంతోషంగా ఉంది.

– వైశాలి, టీచర్, నిర్మల్

ఆత్మీయ సమ్మేళనం



ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని ఆదిలాబాద్ జూనియర్, గౌతమి డిగ్రీ కళాశాలల్లో 2001–2006 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మావలలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వేదికైంది. విద్యార్థులు చిన్ననాటి గుర్తులను నెమరవేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అధ్యాపకులు ఉత్తం, సత్యనారాయణ, శివాజీ, సూరజ్‌సింగ్, పండరి, శ్రీనివాస్, చంద్రకాంత్, గోరఖ్, పూర్వ విద్యార్థులు సిడాం రవి తదితరులు పాల్గొన్నారు.